

రేవంత్ రెడ్డికి జైలు శిక్ష తప్పదు..! 2

RNI NO.TELTEL/2023/87655

# దీక్ష ప్రభ

10-02-2026
మంగళవారం, హైదరాబాద్

తెలుగు దినపత్రిక

సంపుటి: 03 I సంచిక: 315
పేజీలు: 04 I వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.deekshaprabhadaily.com

## మున్సిపల్ ఎన్నికలకు..
# మోడీకి ఏం సంబంధం?



### పాలమూరురంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోడీ

- 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ.. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా?
- కానీ, మోడీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారు
- దక్షిణాది రాష్ట్రాలకు బీజేపీ తీవ్ర అన్యాయం చేస్తోంది
- ఏ రోజైనా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా?
- కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి
- బీజేపీ నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ
- ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదు
- మత రాజకీయాల ద్వారా బీజేపీ రాజకీయ మనుగడ సాగిస్తోంది: సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, దీక్షప్రభ:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తును ఆలోచించుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ.. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా? అని ప్రశ్నించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "పాలమూరురంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని మిగతా2లో...

## సింగరేణిని రక్షించుకోకపోతే
# ముంతపడే ప్రమాదం

- ఆ సంస్థ అప్పుల ఊబిలో విలవిలాడుతోంది
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేశాయి
- రామగుండంలో బీజేపీని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తాం
- రూ.20వేల కోట్లతో ఎన్టీపీసీని విస్తరిస్తాం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

> సింగరేణి సంస్థ అప్పుల ఊబిలో విలవిలాడుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోదావరిఖనిలోని గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. "బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేశాయి.



2



## స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాల
# అవిశ్వాస తీర్మానం?

- ఇప్పటికే విపక్షాలు నోటీసులిచ్చినట్లు సమాచారం
- దీనిపై స్పందించేందుకు నిరాకరించిన కాంగ్రెస్

**నేషనల్ బ్యూరో, దీక్షప్రభ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదంతో ఉభయ సభల కార్యకలాపాలకు తరచూ అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడనివ్వడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ మిగతా2లో...



# 'సర్' ప్రక్రియ కొనసాగాల్సిందే..

- ఎలాంటి అడ్డంకులు కల్పించవద్దు
- ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము కల్పించుకుంటాం
- ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలి: సుప్రీంకోర్టు

**నేషనల్ బ్యూరో, దీక్షప్రభ:** బెంగాల్‌లో నిర్వహిస్తోన్న 'సర్' కసరత్తును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము కల్పించుకుంటామని మిగతా2లో...



## హుస్నాబాద్ అభివృద్ధికి 'హస్తం' అందించండి

- 75 ఏళ్ల చరిత్రలో హుస్నాబాద్‌కు మొదటిసారి మంత్రి పదవి దక్కింది
- ఈ బలం పట్టణ అభివృద్ధికి అడ్డాగా మారాలి
- మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్

2

## 60 ఏళ్లు దాటితే ఏ పనీ చేయలేమన్న సైకాలజీని ప్రజల్లో మార్చాలి

- ఏపీలో మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకొస్తాం
- మధ్యాహ్న భోజనం, అంగన్వాడీల్లో పౌష్టికాహారం అందేలా చూడాలి
- సాధారణ ప్రసవాలు పెరిగేలా, సిజేరియన్లు తగ్గేలా చూడాలి
- పరీక్షలంటే విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా చూడాలి
- రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గేలా చూడాలి
- తీవ్ర నేరాల కట్టడి విషయంలో కొన్ని జిల్లాలు ఇంకా మెరుగైన పనితీరు కనబర్చాలి: ఏపీ చంద్రబాబు



2

# 6 గ్యారెంటీలు అంటే.. అబద్ధాలు

### పని చేయలేని ప్రభుత్వం.. ప్రచారాలతో కాలం గడుపుతోంది

- పని చేయలేని ప్రభుత్వం.. ప్రచారాలతో కాలం గడుపుతోంది
- ప్రజలకు ఉపయోగపడే ఒక్క పని కూడా కనిపించడం లేదు
- రాష్ట్రం నడవాల్సిన దిశలో కాదు... రాజకీయ గందరగోళం లో పడిపోయింది
- మాజీ మంత్రి కేటీఆర్



**మహబూబాబాద్, దీక్షప్రభ:** మాటలు ఒకటి.. చేతలు మరొకటి.. హామీలు వందలు .. అమలు శూన్యం.. ఇది ప్రజా పాలన కాదు.. ప్రజల మీద జరిగిన అతిపెద్ద రాజకీయ మోసమంటూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైరయ్యారు. మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ సోమవారం మహబూబాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందు ఇచ్చిన హామీలను విస్మరించి, అధికారంలోకి వచ్చాక కేవలం కక్ష సాధింపులకే పాలనను పరిమితం చేశారన్నారు. ఆరు గ్యారెంటీలు అంటే.. ఆరు అబద్ధాలని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు మిగతా2లో...

## అమెరికా–భారత్ ట్రేడ్ ఒప్పందంతో మందుబాబులకు కిక్కు..

- అమెరికా నుంచి దిగుమతయ్యే మద్యం , వైన్ పై తగ్గించేందుకు భారత ప్రభుత్వం అంగీకారం
- అమెరికన్ విస్కీలు, వైన్లపై పన్నులు 30 నుంచి 40 శాతానికి పరిమితం అయ్యే అవకాశం
- దీంతో భారీగా తగ్గనున్న మద్యం ధరలు

2

## డిసిఎస్ ప్రక్రియను మార్చి 15లోగా పూర్తి చేయాలి

- డిజిటల్ క్రాప్ సర్వే కేంద్ర, రాష్ట్ర పథకాల అమలుకు ఉపకరిస్తుంది
- జిఎస్‌డిపి గణాంకాలకు ఈ సర్వే ఉపయుక్తం
- రాష్ట్రంలో 10,877 గ్రామాల్లో డిసిఎస్ సర్వే చేపట్టాం
- జిల్లా కలెక్టర్లు, ఎన్ ఐ సి అధికారుల సహకారంతో సర్వేను పూర్తి చేయాలి
- సి ఎస్ రామకృష్ణారావు

2

## స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాల అవిశ్వాస తీర్మానం..?

(మొదటి పేజీ తరువాయి)
స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చేందుకు విపక్షాలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ కథనం వెల్లడించింది.అవిశ్వాస తీర్మానం తెచ్చేందుకు ఇప్పటికే విపక్షాలునోటీసులిచ్చినట్లు సమాచారం. త్వరలోనే ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై స్పందించేందుకు కాంగ్రెస్ నిరాకరించింది. తమ చర్య కోసం వేచిచూడాలని పేర్కొంది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ప్రసంగించేందుకు విపక్ష నేత రాహుల్ గాంధీని స్పీకర్ అనుమతించలేదని ప్రతిపక్షాల ప్రధాన ఆరోపణ. ఇక, కాంగ్రెస్ ఎంపీలు, మహిళా నేతలను కించపరిచేలా మాట్లాడిన భాజపా ఎంపీ నిషికాంత్ దూబేపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అందుకే ఈ అవిశ్వాస తీర్మానం తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తీర్మానం తీసుకురావాలంటే కనీసం 100 మంది ఎంపీల సంతకాలు అవసరం. ప్రస్తుతం విపక్షాలు ఆ సంతకాల సేకరణలో ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితర పార్టీలు పాల్గొన్నట్లు తెలిపాయి.మరోవైపు, పార్లమెంట్‌లో సోమవారం కూడా సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. విపక్షాల నిరసనలతో లోక్‌సభ పలు మార్లు వాయిదా పడింది. అటు రాజ్యసభలో ఖర్గే ప్రసంగానికి అనుమతి లభించకపోవడంతో విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి.

## హుస్నాబాద్ అభివృద్ధికి 'హస్తం' అందించండి

**హుస్నాబాద్, దీక్షప్రభ:** హుస్నాబాద్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, ఇందుకోసం 20 కి 20 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 75 ఏళ్ల చరిత్రలో హుస్నాబాద్‌కు మొదటిసారి మంత్రి పదవి దక్కిందని, ఈ బలం పట్టణ అభివృద్ధికి అడ్డాగా మారాలన్నారు. ఇప్పటికే ఇంజనీరింగ్ కళాశాల తెచ్చామని, త్వరలో 250 పడకల ఆసుపత్రి, పీజీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో జరగని అభివృద్ధిని ఏడాది కాలంలోనే చేసి చూపామని, 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. సన్న బియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలు కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. చౌటపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్, సెట్విన్ శిక్షణ కేంద్రాల ద్వారా ఉపాధి కల్పిస్తామని, హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలుపుతామని స్పష్టం చేశారు. హుస్నాబాద్ భవిష్యత్తు కోసం చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## సింగరేణిని రక్షించుకోకపోతే మూతపడే ప్రమాదం

**గోదావరిఖని, దీక్షప్రభ:** సింగరేణి సంస్థ అప్పుల ఊబిలో విలవిలాడుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోదావరిఖనిలోని గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ''బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేశాయి. రామగుండం ప్రాంత అభివృద్ధి కోసం గత ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఇక్కడ ఎరువుల కర్మాగారం, పవర్ ప్రాజెక్టు తెచ్చింది బీజేపీ. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడులు పెడుతుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు. రామగుండంలో బీజేపీని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తాం. రూ.20వేల కోట్లతో ఎన్టీపీసీని విస్తరిస్తాం. సింగరేణిని రక్షించుకోకపోతే మూతపడే ప్రమాదముంది. కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోంది.తెలంగాణలో కారు పంక్చర్ అయింది. ఆ పార్టీలో ఉన్న నాయకులు తలో దారి చూసుకున్నారు. బీఆర్ఎస్‌లో జరిగిన అవినీతిపై కేసీఆర్ కుమార్తె కవిత కూడా చెబుతున్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.4వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా ?కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదు. రౌడీయిజం, గూండాయిజంపై ఆ పార్టీ బతుకుతోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు నడుస్తున్నాయి. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సింగరేణిని రక్షించేది భాజపా మాత్రమే. కోల్‌బెల్ట్ ప్రాంతంలో కాషాయ జెండా ఎగిరితేనే సింగరేణికి మనుగడ ఉంటుంది. గతంలో బీఆర్ఎస్‌కు చెప్పిన విధంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి. ఈ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను ప్రజలు గెలిపించాలి'' అని కిషన్‌రెడ్డి కోరారు.

## అమెరికా-భారత్ ట్రేడ్ ఒప్పందంతో మందుబాబులకు కిక్కు..

**నేషనల్ బ్యూరో, దీక్షప్రభ:** భారత్, అమెరికా మధ్య సుదీర్ఘ చర్చల అనంతరం ప్రతిష్టాత్మ ట్రేడ్ డీల్ కుదిరిన విషయం తెలిసిందే. ఈ డీల్‌లో భాగంగా భారత ప్రభుత్వం అమెరికా నుంచి భారత్‌లోకి దిగుమతి అయ్యే వస్తువులపై భారత్ సుంకాలను తగ్గించింది. దీంతో దేశంలోని మద్యం ప్రియులకు తీపి కబురు అందింది. అగ్రరాజ్యం అమెరికా నుంచి దిగుమతి అయ్యే ప్రీమియం మద్యం , వైన్ పై ఉన్న సుంకాలను గణనీయంగా తగ్గించేందుకు భారత ప్రభుత్వం అంగీకరించింది. ప్రస్తుతం విదేశీ మద్యంపై ఉన్న 150 శాతం రక్షణ సుంకాన్ని ఈ ఒప్పందం ద్వారా భారీగా తగ్గించనున్నారు. కొత్త నిబంధనల ప్రకారం, అమెరికన్ విస్కీలు, వైన్లపై పన్నులు 30 నుంచి 40 శాతానికి పరిమితం అయ్యే అవకాశం ఉంది. దీనివల్ల గతంలో రూ. 4,500 వరకు పలికిన ప్రముఖ బ్రాండ్ల ధరలు ఇప్పుడు రూ. 2,500 నుంచి రూ. 3,000 లోపుకే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అలాగే మద్యం మాత్రమే కాకుండా, ఈ ఒప్పందం వల్ల ఆటోమొబైల్ , ఇతర పారిశ్రామిక రంగాల్లో కీలక మార్పులు రానున్నాయి. అమెరికా నుండి దిగుమతి అయ్యే కార్లు, బైక్‌లపై 'కోటా ఆధారిత' సుంకాల తగ్గింపును భారత్ ప్రకటించింది. దీనివల్ల హార్లే డేవిడ్సన్ వంటి లగ్జరీ బైక్‌లు, అమెరికన్ బ్రాండ్ల వాహనాల ధరలు తగ్గుతున్నాయి. ప్రతిగా, అమెరికా కూడా భారత్ నుంచి ఎగుమతి అయ్యే సుమారు 31 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై పన్నులను 50 శాతం నుంచి ఏకంగా 18 శాతానికి తగ్గించింది. దీనివల్ల అమెరికా మార్కెట్‌లో భారతీయ వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, హస్తకళా వస్తువులకు విపరీతమైన డిమాండ్ పెరిగి, భారత ఎగుమతిదారులకు భారీ లాభాలు చేకూరనున్నాయి. ఎన్నో చర్చల తర్వాత భారత్, అమెరికా దేశాల మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందం వల్ల ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు భారీ ప్రయోజనం చేకూరనుంది. రాబోయే ఐదేళ్లలో భారత్ అమెరికా నుండి సుమారు 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం, సాంకేతిక పరికరాలు, విమాన భాగాలను కొనుగోలు చేయనుంది. ఈ ఒప్పందంతో అటు విదేశీ మద్యం ధరలు తగ్గి సామాన్యులకు ఉపశమనం లభించడంతో పాటు, ఇటు భారతీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గట్టి పోటీ నిచ్చే సామర్థ్యం లభించింది.

# రేవంత్ రెడ్డికి జైలు శిక్ష తప్పదు..!

- ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన దొంగ
- సాక్ష్యాలు మాయం చేసేందుకు ఫోరెన్సిక్ ల్యాబ్ ను దగ్ధం చేశాడు
- పోలీసుల సహకారంతో ఈ కుట్ర జరిగింది
- మిర్యాలగూడ, భూపాలపల్లి, నిజామాబాద్ పోయిండు ముఖ్యమంత్రి
- కానీ మెదక్ కు వచ్చేందుకు ముఖం లేదు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు



**మెదక్ ప్రతినిధి, దీక్షప్రభ:** ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్ రెడ్డి కి జైలు శిక్ష తప్పదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మెదక్ రామదాస్ చౌరస్తా వద్ద ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫోరెన్సిక్ ల్యాబ్ జరిగిన అగ్ని ప్రమాదం వెనుక రేవంత్ రెడ్డి హస్తం ఉందన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ రేవంత్ రెడ్డికి త్వరలోనే జైలు శిక్ష ఖాయమన్నారు. జైలుకు పోయే సమయం దగ్గరకు వచ్చినందుకే సాక్ష్యాలు మాయం చేసేందుకు హైదరాబాద్ లో ఫోరెన్సిక్ ల్యాబ్ ను దగ్ధం చేశాడన్నారు. పోలీసుల సహకారంతో ఈ కుట్ర జరిగిందని ఆరోపించారు. హైదరాబాద్ లో పేదల బతుకులు కూల్చి, జైలుకు పోకుండా ఉండేందుకు సాక్ష్యాలను మాయం చేశాడని ఆరోపించారు. రేవంతు డైరెక్షన్ లోనే పోలీసులు ఈ దహన కాండ జరిగినదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేండ్ల కాలంలో రాష్ట్ర ప్రజలకు చేసింది గుండు సున్నా అన్నారు. మిర్యాలగూడ, భూపాలపల్లి, నిజామాబాద్ పోయిండు ముఖ్యమంత్రి కానీ మెదక్ కు వచ్చేందుకు ముఖం లేదన్నారు.ఏడుపాయల అమ్మవారి మీద ఒట్టు వేసి మాట తప్పిండు కాబట్టి ఆయనకు రావడానికి భయం పుట్టుకుందన్నారు. రుణమాఫీ చేస్తానని మెదక్ లో ఏడుపాయల అమ్మవారి పై ఒట్టు వేసి మాట తప్పి మోసం చేసిండన్నారు. రైతు బంధు ఎగ్గొట్టి, రాష్ట్రంలో ఎరువుల కరువు రేవంత్ రెడ్డి తెచ్చడన్నారు. రేవంతు బూతులు మాట్లాడటం తప్ప ఒక్క మంచి పని చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడో రంజాన్ వచ్చిందని, కానీ ముస్లిం లకు పండగ తోఫా కూడా ఇవ్వడం లేదన్నారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులు రావడం లేదని, తులం బంగారం దిక్కు లేదన్నారు. కేసీఆర్ మైనారిటీ గురుకులాలు , షాదీ ఖానా ఏర్పాటు చేశారని చెప్పారు. కేసీఆర్ బిఆర్ఎస్ పార్టీని సెక్యులర్ పార్టీగా నిలబెట్టారు. రేవంత్ రెడ్డి తెల్లవారితే కేసీఆర్, హరీశ్ రావులను తిడితే పేదల కడుపు నిండుతుందా అని ప్రశ్నించారు. ఇక్కడి ఎమ్మెల్యే చాలా గొప్పోడు ఎన్నికల సమయంలో 25 గంటల కరెంటు ఇస్తా అన్నాడు. కనీసం 12 గంటలు కూడా రావడం లేదన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి 12 వేలు అని గుండు కొట్టిండు, ఉద్యోగస్థులకు డీఏ లేదు, పీఆర్సీ ఇవ్వడం లేదన్నారు.

**బిల్లులు రావని బెదిరింపులు..**

రిటైర్డ్ ఉద్యోగులకు రిటైర్ బెన్ఫిట్స్ లేవు, అన్ని వర్గాల ప్రజలను రేవంత్ రెడ్డి దారుణంగా మోసం చేసిండన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ పిలల చదువులను ఆగం చేసి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అని దగా చేసిండన్నారు. రెండు లక్షల ఉద్యోగాలని నిరుద్యోగులను కూడా మోసం చేసిన ఘనుడు రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ వాళ్లను గెలిపించుకోకుంటే బిల్లులు రావని బెదిరిస్తున్నరట మెదక్ లో నీ పిట్ట బెదిరింపులకు, చిల్లర బెదిరింపులకు భయపడరన్నారు. బిల్లులు మీ జేబుల నుంచి ఇస్తున్నారా? మీ జాగిరా? బరాబర్ బిల్లులు వస్తయి, కొట్లాడి సాధించుకుంటమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పేదలకు రూ. 60 వేలు బాకీ పడ్డారని, అవి ఇచ్చి ఒట్లు అడగాలని చెప్పారు. మెదక్ జిల్లా తెచ్చింది కేసీఆర్, మెడికల్ కాలేజీ, కలెక్టరేట్, రోడ్లు, భవనాలు ఇలా అనేక సంక్షేమ పథకాలను బీ ఆర్ ఎస్ ప్రభుత్వం తెచ్చిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ మోసానికి గుణపాఠం చెప్పాలని కోరారు.

**మల్కాజీ గిరి గుండాలతో రౌడీజం..**

మల్కాజీ గిరి గుండాలతో మెదక్ లో రౌడీయిజం చేస్తున్నారని ఆరోపించారు. మెదక్ ప్రజలు బెదిరిస్తే భయపడరని, మంచి తనంతోనే గెలవాలన్నారు. బెదిరింపులకు పాల్పడితే ఇక్కడి ప్రజలకు బెదరని చెప్పారు. మెదక్ ప్రజలను గెలవాలంటే ఒక్క మంచితనం తోనే సాధ్యమని, బెదిరింపులకు భయపడేది లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, శేరి సుభాష్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ లు బట్టి జగపతి, మల్లికార్జున్ గౌడ్, తిరుపతి రెడ్డి, కృష్ణా రెడ్డి, సురేందర్ గౌడ్ తో పాటు బీ ఆర్ ఎస్ అభ్యర్థులు, నేతలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు రామదాసు చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

## 60 ఏళ్లు దాటితే ఏ పనీ చేయలేమన్న సైకాలజీని ప్రజల్లో మార్చాలి

**అమరావతి, దీక్షప్రభ:** 'సంజీవని' ద్వారా జులై నాటికి 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్ చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కేర్ అండ్ గ్రో ద్వారా మాతాశిశు ఆరోగ్యం, పెరుగుదల వివరాలు నమోదు చేయాలని చెప్పారు. జనాభా నిర్వహణ, సంజీవని ప్రాజెక్టు, పౌష్టికాహారంపై సోమవారం సీఎం చంద్రబాబు సంబంధిత శాఖల మంత్రులు, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ''మాతాశిశువులకు పౌష్టికాహారంతోపాటు సప్లిమెంట్స్ అందించేలా చర్యలు తీసుకోవాలి. మధ్యాహ్న భోజనం, అంగన్వాడీల్లో పౌష్టికాహారం అందేలా చూడాలి. సాధారణ ప్రసవాలు పెరిగేలా, సిజేరియన్లు తగ్గేలా చూడాలి. 60 ఏళ్లు దాటితే ఏ పనీ చేయలేమన్న సైకాలజీని ప్రజల్లో మార్చాలి. వివిధ వర్గాలతో అధికారులు మాట్లాడితే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ సిస్టం ద్వారా జూన్ నాటికి సమగ్ర కార్డులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి. వచ్చే ఏడాది ఎయిడ్స్ ఫ్రీ ఏపీగా డిక్లేర్ చేస్తాం.జనాభా విషయంలో చాలా దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరిగింది. యూరప్‌లోని 20 దేశాల్లో ఏజింగ్ సమస్యతో సామాజిక వేడుకలు లేవు. ఏపీలో మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకొస్తాం. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలి. పరీక్షలంటే విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా చూడాలి'' అని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గేలా చూడాలని సీఎం అధికారులకు సూచించారు. తీవ్ర నేరాల కట్టడి విషయంలో కొన్ని జిల్లాలు ఇంకా మెరుగైన పనితీరు కనబర్చాలన్నారు. ఇకపై శాంతిభద్రతల విషయంపై ప్రతి నెల సమీక్షిస్తానని తెలిపారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. 16 ఏళ్లలోపు వారు సామాజిక మాధ్యమాలను వినియోగాన్ని నియంత్రించేలా ఓ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. ట్రూ డౌన్ ద్వారా వినియోగదారుడికి ప్రయోజనం దక్కాలని సీఎం స్పష్టంచేశారు. రూ.3.90కే విద్యుత్ కొనుగోలు ధర తగ్గేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వ్యవసాయంలో ఏఐ సాంకేతికత, విద్యుత్, విత్తన నిర్వహణ, డ్రోన్లు, యాంత్రీకరణ తదితర అంశాలపై సీఎం సూచనలు చేశారు. వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, మెరుగైన ధరలు లభించేందుకు ఉన్న అవకాశాలపై ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ఉండాలని సూచించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు ప్రైవేటు పెట్టుబడులపైనా దృష్టి పెట్టాలన్నారు.



## ఆరు గ్యారెంటీలు అంటే.. ఆరు అబద్ధాలు

(మొదటి పేజీ తరువాయి)
గ్యారెంటీలు ఇప్పటికీ ప్రజలకు కనిపించలేదని కేటీఆర్ విమర్శించారు. "గ్యారెంటీలు మాటల్లోనే ఉన్నాయి.. అమలులో మాత్రం శూన్యం అని ప్రజలకు ఆశలు కాదు. నిరాశే మిగిలింది అంటూ పని చేయలేని ప్రభుత్వం.. ప్రచారాలతో కాలం గడుపుతోందని అన్నారు. రోజుకో ప్రకటన వారంకో ఆరోపణ తప్ప ప్రజలకు ఉపయోగపడే ఒక్క పని కూడా కనిపించడం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రం నడవాల్సిన దిశలో కాదు... రాజకీయ గందరగోళం లో పడిపోయిందనీ రైతులు, నిరుద్యోగ యువత, పేదల సమస్యలు పక్కనపెట్టి బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన అజెండాగా మారిందని కేటీఆర్ ఆరోపించారు. ఇలాంటి పాలన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు.

**మహబూబాబాద్ జిల్లాను తొలగిస్తారట..?**

కేసీఆర్ ఎంతో దూర దృష్టితో ఆలోచించి నూతన జిల్లాలను ఏర్పాటు చేశాడని కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ జిల్లాను ఎత్తివేస్తాడంట ఇది ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా గా ఉన్నప్పుడు పనులు వదులుకొని కలెక్టరేట్ చుట్టూ తిరిగి గోస పడేవారని అలాంటిది ఇక్కడ గిరిజనులు ,పేద ప్రజల సౌలభ్యం కోసం కేసీఆర్ జిల్లాను ఏర్పాటు చేస్తే దాన్ని తొలగిస్తాను అనడంపై ఆయన మండిపడ్డారు.

**మానుకోటను అభివృద్ధి చేసింది కేసీఆర్..!**

మానుకోట జిల్లాను అభివృద్ధి చేసింది కేసీఆర్ అని కేటీఆర్ మరోసారి పునరుద్ఘాటించారు. వందల కోట్ల నిధులతో అభివృద్ధి చేశామని నూతన కలెక్టరేట్, కూరగాయల మార్కెట్, మెడికల్ కాలేజ్, నూతన మున్సిపాలిటీ అనేక పనులు చేశామని గిరిజన జిల్లాలో తండాలను గ్రామ పంచాయతీలుగా మలిచింది కేసీఆర్ అని మానుకోట అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్థాయిలో గుర్తుంటాయన్నారు.

**మొదటిసారి మోసపోయాం రెండోసారి మోసపోవద్దు..!**

మున్సిపల్ ఎన్నికలే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలు ఇచ్చే తొలి తీర్పుగా మారనున్నాయని కేటీఆర్ స్పష్టం చేశారు. మొదటిసారి నమ్మి మోసపోయామని రెండోసారి నమ్మి ఆగం కావొద్దు అంటూ ఓటర్లకు పిలుపునిచ్చారు.మహబూబాబాద్ మున్సిపాలిటీ లోని 36 వార్డులకు 36 గెలిపించాలని అభివృద్ధిని నమ్మే ప్రజలు బీఆర్ఎస్ వైపే నిలబడతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## మున్సిపల్ ఎన్నికలకు.. మోడీకి ఏం సంబంధం?

(మొదటి పేజీ తరువాయి)
ప్రధాని మోడీనే స్వయంగా హామీ ఇచ్చారు. వాటి గురించి చెప్పట్లేదు.. కానీ, మోడీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారు. వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి తిరిగిస్తామని గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మి ఆ పార్టీకి చెందిన 50 మందిని కార్పొరేటర్లుగా గెలిపించారు. ఎన్నికలయ్యాక అడిగితే.. వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారు.

**దక్షిణాదికి తీవ్ర అన్యాయం..**

తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని బీజేపీ నేతలు చెబుతున్నారు. దీనిపై సీఎస్‌ను వివరణ అడిగితే.. మనం రూపాయి చెల్లిస్తే.. కేంద్రం 42 పైసలు ఇస్తోందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు బీజేపీ తీవ్ర అన్యాయం చేస్తోంది. బిహార్ ఒక్క రూపాయి పన్ను చెల్లిస్తే.. రూ.6.16 కేంద్రం ఇస్తోంది. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఏ రోజైనా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా? మనకు అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదు. మనం చెల్లించిన నిధులు తిరిగిస్తే చాలు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షాణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి.. ఏపీకి తరలించారు. ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోడీకి ఏం సంబంధం? బీజేపీ నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ. ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదు. మత రాజకీయాల ద్వారా బీజేపీ రాజకీయ మనుగడ సాగిస్తోంది'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## డిసిఎస్ ప్రక్రియను మార్చి 15లోగా పూర్తి చేయాలి

**హైదరాబాద్, దీక్షప్రభ:** రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను మార్చి 15వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుడు, అగ్రిస్టాక్ చీఫ్ నాలెడ్జ్ ఆఫీసర్ రాజీవ్ చావ్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేశ్‌కుమార్, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రెటరి రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ తాము సూచించిన గడువులోగా డిసిఎస్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లు, ఎన్ ఐ సి అధికారుల సహకారంతో సర్వేను పూర్తి చేయాలని సూచించారు. సీజినల్ డిజిటల్ క్రాప్ సర్వేతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలకు ఉపకరిస్తుందని, అదేవిధంగా స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి(జిఎస్‌డిపి) గణాంకాలకు ఈ సర్వే ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10,877 గ్రామాల్లో డిసిఎస్ సర్వే చేపట్టడం జరిగిందని అధికారులు తెలిపారు. దేశంలోని యుపి, బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, ఒడిశా తదితర రాష్ట్రాల్లో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ పూర్తి అయిందని కేంద్ర ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్ చావ్లా వెల్లడించారు. అదే తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ సంచాలకులు గోపి ఇప్పటి వరకు చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే వివరాలను ఉన్నతాధికారులకు వివరించారు.

## 'సర్' ప్రక్రియ కొనసాగాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి)
పేర్కొంది. అంతేకానీ సర్ ప్రక్రియలో అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దని బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ(సర్) కోసం 300మంది అధికారులను కేటాయించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని కోరితే..80 మంది గ్రేడ్2 స్థాయి అధికారులనే కేటాయించిందని న్యాయస్థానానికి ఈసీ తెలియజేసింది.మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడం లేదని బెంగాల్ ప్రభుత్వం పేర్కొంది. ఇంటి పేర్లలో అక్షరదోషాలు, వివాహం తర్వాత మహిళల చిరునామాలలో మార్పు వంటి చిన్న లోపాలను సాకుగా చూపి.. ఓట్లు తొలగిస్తున్నారని ధర్మాసనానికి తెలిపింది. దీనివల్ల 1.36 కోట్ల మంది ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. తమ స్థానికతను నిరూపించుకోవడానికి ఓటర్లకు ఈసీ ఒక్క అవకాశమూ ఇవ్వలేదని బెంగాల్ సర్కార్ న్యాయస్థానానికి తెలియజేసింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్రంలో ఓటర్ల దరఖాస్తులు పూర్తి చేయడానికి, డేటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడిగిస్తున్నట్లు వెల్లడించింది.



## 12న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**ఏఐయుకేఎస్ గోడపత్రికల ఆవిష్కరణ**




**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** మండలంలోని పడమటిగూడెం గ్రామంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను ఏఐయుకేఎస్ డివిజన్ అధ్యక్షుడు చిర్ర యాకన్న ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశంలో కార్మికులు రైతు కూలీలను హక్కు లేని బానిసలుగా మార్చే దిశగా దాడి చేస్తుందని విమర్శించారు.కార్మిక చట్టాల పేరుతో కార్మిక కోడ్లను కాలరాస్తూ, కార్పొరేట్ శక్తులను దోచిపెట్టె కుట్ర జరుగుతుందని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా ఈనెల 12 న జరగనున్న సార్వత్రిక సమ్మెను ప్రతి ఒక్కరు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొమ్ము కుమార్, చిర్రా హనుమంతు, అనిల్, అమృత, యాకయ్య, మల్లయ్య, లింగమ్మ, మంచాల కొమురయ్య, ఎర్ర అశోక్, కాశి రెడ్డి, రామి రెడ్డి, జక్కుల యకసాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తులు ముఖ్యం కాదు ఆరోగ్యమే ముఖ్యం

- **బాన్సువాడ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోట శ్రీకాంత్**
- **తోట లక్ష్మీబాయి 13వ వర్ధంతి సందర్భంగా కోటగిరిలో ఫ్రీ హెల్త్ క్యాంప్**




**కోటగిరి,దీక్ష ప్రభ:** అందరికీ ఆస్తులు ముఖ్యం కాదని ఆరోగ్యమే ముఖ్యమని బాన్సువాడ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ప్రముఖ ప్రజా సేవకుడు తోట శ్రీకాంత్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని గ్రామ చావిడి ఆవరణలో తోట శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ బర్ల మదుకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా.. బాన్సువాడ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోట శ్రీకాంత్ మాట్లాడుతూ.. తన తల్లి కీర్తిశేషులు తోట లక్ష్మీబాయి స్వర్గస్తురాలై నేటితో 13 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో ప్రజల సౌకర్యార్థం ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సేవలో ఉండాలని అమ్మ ఎప్పుడూ అనేదని మా అమ్మ మాటలు నిజం చేస్తూ నేటి రోజున గ్రామ ప్రజలు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఉద్దేశంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆస్తులు ముఖ్యం కాదు ఆరోగ్యం ముఖ్యం అని మా అమ్మగారు ఎల్లప్పుడూ అనే మాటలను..ఈ కార్యక్రమం ద్వారా మా అమ్మ మాటలు నిజం చేశానని ఆయన భావోద్వేగంతో తెలిపారు. అనంతరం డాక్టర్.ప్రణయ్ మాట్లాడుతూ.. మెడికవర్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిలంలో సుమారు 200 మంది పేద ప్రజలకు బిపి. షుగర్, ఈసీజీ, థైరాయిడ్, వెయిట్ ,ఆర్ బి సి, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్, తోట సాయిలు, కూచి శ్రీనివాస్, కూచి సుభాష్, మొతిపేట రాజయ్య, కొయిగూరు సాయిలు, ఎల్లుట్ల పోతయ్య,గర్దాస్ గంగాధర్, నరేష్ యాదవ్, గాండ్ల వీరేశం, హాస్పిటల్ సిబ్బంది అశ్విని,మోహన్, రవి,బాన్స్వాడ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోట శ్రీకాంత్ గ్రామ పెద్దలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి రూ.5లక్షల విరాళం

- **రూ.5లక్షల నగదును అందజేసిన గంధపు మున్నూరు కాపు సంఘం సభ్యులు**
- **కృతజ్ఞతలు తెలిపిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు**



**పోతంగల్,దీక్ష ప్రభ:** పోతంగల్ మండల కేంద్రంలోని పాత పోతంగల్ లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక గంధపు మున్నూరు కాపు సంఘం సభ్యులు రూ.5,12,511 విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సోమవారము నగదు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయల కమిటీ సభ్యులు మాట్లాడుతూ..ఆలయ నిర్మాణం కోసం రూ.5లక్షల భారీ విరాళాన్ని అందజేసిన గంధపు మున్నూరు కాపు సంఘం సభ్యులకు కృజ్ఞతలు తెలిపారు. పూర్తిగా రాతితో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి, శిల్పకళ ఉట్టిపడేలా అద్భుతంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయం నిర్మాణం దాదాపు పూర్తయిందని త్వరలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గంధపు మున్నూరు కాపు సంఘం సభ్యులు మాజీ ఎంపీపీ గంధపు పవన్, గంధపురాజు, గంధపు శంకర్, గంధపు హన్మండ్లు, గంధపు విఠల్, గంధపు గణేష్,ఆలయ కమిటీ సభ్యులు గంట్ల విఠల్, మానికప్ప, లింగరాం,చెర్రీ ,పీరాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పీఆర్టీయూ 53వ ఆవిర్భావ వేడుకలు

**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** పీఆర్టీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల విద్యా వనరుల కేంద్రంలో మండల అధ్యక్షుడు ఎర్ర పూర్ణచందర్ జెండాను ఎగరేశారు. సంఘ వ్యవస్థాపకుడు సామల యాదగిరి ఫొటోకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్టీయూ ముందుంటుందని పేర్కొన్నారు. అనంతరం పిఆర్టియు వ్యవస్థాపక సభ్యులు సంకేపల్లి రాఘవ రెడ్డి మృతికి మౌనం పాటించి, గండి బిక్షం, ఎల్లారెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, పెద్ద నాగారం కాంప్లెక్స్ హెచ్ఎం జానకి సుమన, జయపాల్ రెడ్డి,మాధవిలను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొండ సంజీవ,రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి,జిల్లా బాధ్యులు వెంకటరెడ్డి, శేఖర్, మోహన్ రెడ్డి, భూక్య నాగేష్, మండల నాయకులు శ్రీను, మహిపాల్, యాకసాయిలు, కరుణాకర్, శ్యాంబాయి,భాగ్యలక్ష్మి, రజిత, శంకర్, సీఆర్పీలు,ఎంఆర్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## శ్రీశైలం క్యూలైన్లను పరిశీలించిన ఈవో యం.శ్రీనివాసరావు

- **శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలైన్ లను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ**

**శ్రీశైలం దీక్ష ప్రభ:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం దేవస్థానం పలు ఏర్పాట్లు చేయడం జరిగింది ఇందులో భాగంగా శివ స్వాముల కొరకు ఏర్పాటుచేసిన క్యూలైన్లను దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాస రావు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. అదేవిధంగా చంద్రవతి కల్యాణమండపాన్ని కూడా వారు ఆయా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులందరు కూడా దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుంటూ శ్రీస్వామిఅమ్మవార్లను ప్రశాంతగా దర్శించుకోవాలన్నారు. భక్తులరద్దీ అధికంగా ఉంటోందని భక్తులందరు సంయమనంతో పాటించాలన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు కూడా పరస్పర సమన్వయంతో విధులు నిర్వహిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎపట్పికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కార్యనిర్వహణాధికారివారు పలువురు భక్తులతో ముఖాముఖిగా సంభాషిస్తూ దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లపై చర్చించడం జరిగింది. ముఖ్యంగా భక్తులందరికీ కూడా సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు భక్తులందరు కూడా అలంకార దర్శనం మాత్రమే కల్పించబడుతోంది. అయితే జ్యోతిర్ముడి ధరించిన శివదీక్షా భక్తులకు మాత్రం ఉత్సవాలలో అయిదురోజుల పాటు అనగా 08.02.2026 నుండి 12.02.2026 వరకు నిర్ణీత వేళలలో శ్రీ స్వామివారి స్పర్శ దర్శనమునకు అవకాశం కల్పించబడింది.సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకుగాను ప్రముఖులకు కూడా నిర్ణీత వేళలలో మాత్రమే విరామ దర్శనం కల్పించబడుతోంది. భక్తుల సౌకర్యార్థం మొత్తం అయిదు క్యూలైన్లను ఏర్పాటు చేయడం జరిగింది.ఉచితదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా శివదీక్షా భక్తుల ప్రత్యేక క్యూలైన్, వృద్ధులు, దివ్యాంగులకు మరో క్యూలైన్ ఏర్పాటు చేయబడింది. ఉచితదర్శన క్యూలైను రథశాల నుంచి ప్రారంభమవుతుంది. రథశాల వద్ద నుంచి క్యూలైన్లలో ప్రవేశించిన ఉచిత సర్వదర్శనం భక్తులకు క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయ ప్రవేశం కల్పించబడుతుంది. ఈ సర్వదర్శనం భక్తులకు క్యూ కాంప్లెక్స్ నందు వేచి వుండేందుకువీలుగా మొత్తం 20 కంపార్టుమెంట్లలో ఆయా ఏర్పాట్లను చేయడం జరుగుతుంది. శీఘ్రదర్శనం (రుసుము రూ.200/లు) క్యూలైను క్యూకాంప్లెక్సు కుడివైపున (క్యాంటిన్ భవనం తొలగించిన చోట) నుంచి ప్రారంభమవుతున్నది. అతిశీఘ్రదర్శన క్యూలైన్ (రుసుము 500/లు) గతంలో క్యాంపుకోర్టు భవనము గల ప్రదేశం నుండి ప్రారంభమవుతుంది.వృద్ధులు,దివ్యాంగులు,చంటిపిల్లల తల్లుల క్యూలైన్ ఉమరామాలింగేశ్వరస్వామి ఆలయం ముందు నుంచి ప్రవేశం కల్పించడానికి ఏర్పాట్లు చేయబడ్డాయి. క్యూకాంప్లెక్స్‌లో వేచివుండే భక్తులకు నిరంతరం అల్పాహారం, బిస్కెట్లు, మంచినీరు అందించబడుతున్నాయి. అదేవిధంగా క్యూలైన్లలో కూడా భక్తులకు నిరంతరం మంచినీరు అందించడం జరుగుతున్నది. క్యూలైన్లలో అత్యవసర ద్వారాలు ఏర్పాటు చేయబడ్డాయి.



**శివదీక్షా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు**

శివదీక్షా భక్తుల సౌకర్యార్థం పలు ఏర్పాట్లు చేయబడ్డాయి. శివదీక్షాభక్తులు దర్శనానికి వేచివుండేందుకు వీలుగా చంద్రవతి కల్యాణమండపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయబడ్డాయి. ఈ కల్యాణమండపంలో మొత్తం 4 కంపార్టుమెంట్లు ఆయా ఏర్పాటు చేయబడ్డాయి.దర్శనానికి వేచివుండే శివదీక్షా భక్తులకు నిరంతరం అల్పాహారం,మంచినీరు అందజేయబడుతున్నాయి.

అల్పాహార అందజేతలో ఎటువంటి ఆలస్యం లేకుండా ఉండేందుకు చంద్రవతి కల్యాణమండపం వద్దనే అల్పాహార వంటకాలు చేయడం జరుగుతోంది. శివదీక్షా భక్తుల దర్శనానికి కూడా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయడం జరిగింది. చంద్రవతి కల్యాణమండపం నుంచి ఈ క్యూలైన్ ప్రారంభమవుతున్నది. దీక్షాభక్తులను ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనానికి విడతల వారీగా, నిర్ధిష్ట సమయాలలో దర్శనానికి అనుమతించడం జరుగుతోందని మీడియాకు తెలిపారు.

## మా ప్లాట్లను కాపాడండి

- **విద్యుత్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు హెచ్.టి రమేష్ బాబు, ఉపాధ్యక్షులు ఎం.ఎస్.కె ప్రసాద్**




**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** విద్యుత్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ 716 మంది ప్లాట్లను కొంతమంది దుండగులు కబ్జాలు చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం గమనించి మాకు న్యాయం చేయాలని విద్యుత్ సొసైటీ అధ్యక్షులు హెచ్.టి రమేష్ బాబు, ఉపాధ్యక్షులు ఎం.ఎస్.కె ప్రసాద్ లు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆదివారం వారు జనరల్ బాడీ మీటింగ్ లో మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మండలం, ఐలాపూర్ గ్రామంలోని సర్వే నం.119లో 131.05 ఎకరాల భూమిని కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. వివిధ అమ్మకందారుల (1131968)లో ఇచ్చిన ఉత్తర్వులతో సహా వివిధ పత్రాలను సొసైటీ క్షుణ్ణంగా పరిశీలించిందనీ తెలిపారు. గ్రామ పంచాయతీ ద్వారా లేఅవుట్ ఆమోదించబడిందని తెలిపారు. ఆమోదించిన లేఅవుట్‌లో సొసైటీ ఒక మోడల్ హౌస్‌ను నిర్మించింది. ఆమోదించిన లే అవుట్ ప్రకారం సభ్యులకు ప్లాట్లు రిజిస్టర్ చేయబడ్డాయనీ తెలిపారు. సంగారెడ్డి జాయింట్ కలెక్టర్ 12 ఏళ్ల తర్వాత, అంటే 1994లో, పాత ఉత్తర్వు (తేదీ 1951982)ను సవరిస్తూ, ఇవి ప్రభుత్వ భూములు అని, భూమి స్వభావాన్ని మార్చకూడదని మధ్యంతర ఉత్తర్వులు పొందింది. ప్రస్తుతం ఈ రిట్ అప్పీళ్లు ఇంకా పరిష్కారం కావలసి ఉంది. హైకోర్టు మూడు వేర్వేరు తీర్పుల ద్వారా సొసైటీ హక్కును సమర్థించిందనీ అన్నారు. సొసైటీ 716 సభ్యులందరూ 70 ఏళ్లు పైబడిన వారు, ఇప్పటి వరకు సుమారు 300 మంది సభ్యులు మరణించారనీ తెలిపారు. మా సొసైటీ సభ్యులు కోర్ట్ ఉత్తర్వులను శిరసావహిస్తూ ఎటువంటి కట్టడాలు మా భూమిలో చేయడం లేదు. కానీ మరోవైపు మా భూమిని కోర్ట్ కానీ రెవిన్యూ సిబ్బంది కానీ, పోలీస్ మా భూమిని కోర్ట్ ఉత్తర్వుల ప్రకారంగా రక్షించడం లేదు. మేము కలెక్టర్, ఆర్డిఒ, ఎంఆర్ఒ, పోలీసు అధికారులకు అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ, ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. దాన్ని ఆసరాగా చేసుకొని ఇటీవల భూ ఆక్రమణదారులు అర్ధరాత్రి వేళల్లో బౌన్సర్లను నియమించి మా లేఅవుట్‌కు దక్షిణాన ఉన్న ప్లాట్ మార్కింగ్ రాళ్లను ధ్వంసం చేసి, మా సరిహద్దు వెంబడి ఉన్న భూమిని ఆక్రమించుకుని మా సభ్యులను బౌన్సర్లతో బెదిరిస్తున్నారనీ అన్నారు. ఆ విషయాన్ని పోలీస్ అధికారులకు విన్నవించడం జరిగిందనీ, మాకు ఎటువంటి సహకారం అందడం లేదనీ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మాకు ప్రభుత్వం న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు బుచ్చిబాబు, హనుమండ్లు, మహదేవ్ సింగ్, ఖాజా జమీరుద్దీన్, ఏ.రాజాబాబు,మధుర భాయి, రవి జయప్రద, సుజాత లీలా, సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పీఆర్టీయూ 53వ ఆవిర్భావ వేడుకలు



**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** పీఆర్టీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల విద్యా వనరుల కేంద్రంలో మండల అధ్యక్షుడు ఎర్ర పూర్ణ చందర్ జెండాను ఎగరేశారు. సంఘ వ్యవస్థాపకుడు సామల యాదగిరి ఫొటోకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్టీయూ ముందుంటుందని పేర్కొన్నారు. అనంతరం పిఆర్టియు వ్యవస్థాపక సభ్యులు సంకేపల్లి రాఘవ రెడ్డి మృతికి మౌనం పాటించి, గండి బిక్షం, ఎల్లారెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి ,పెద్ద నాగారం కాంప్లెక్స్ హెచ్ఎం జానకి సుమన, జయపాల్ రెడ్డి,మాధవిలను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొండ సంజీవ, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా బాధ్యులు వెంకటరెడ్డి, శేఖర్, మోహన్ రెడ్డి, భూక్య నాగేష్, మండల నాయకులు శ్రీను, మహిపాల్, యాకసాయిలు, కరుణాకర్, శ్యాంబాయి, భాగ్యలక్ష్మి, రజిత, శంకర్, సీఆర్పీలు, ఎంఆర్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో స్వామి అమ్మవార్లకు భృంగి వాహనసేవ

### మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

**శ్రీశైలం,దీక్ష ప్రభ:** శ్రీశైలం జ్యోతిర్లింగ క్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు రెండవరోజు శుభ సోమవారం (09.02.2026) శ్రీ స్వామి అమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. తరువాత యాగశాల యందు శ్రీ చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం లోక కల్యాణం కోసం జపాలు, పారాయణలు చేయబడ్డాయి ,అనంతరం మండపారాధనలు, పంచావరణార్చనలు, జపానుష్ఠానాలు, నిత్యహవనాలు,రుద్రహోమం, చండీహోమం,కార్యక్రమాలు ఆగమ శాస్త్రం ప్రకారంగా జరిపించబడ్డాయి.అదే విధముగా ఈ సాయంకాలం ప్రదోష కాలపూజలు, జపానుష్ఠానాలు, రుద్రపారాయణలు, హోమాలు జరిపించబడుతాయి.ఈ బ్రహ్మోత్సవాలలో నిర్వహించబడే వాహనసేవలలో భాగంగాసోమవారం సాయంకాలం శ్రీ స్వామి అమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహించారు.ఈ సేవలో శ్రీ స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో భృంగి వాహనంపై వేంచేబు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించడం జరిగింది. తరువాత శ్రీశైలక్షేత్ర ప్రధాన వీధులలో గ్రామోత్సవం జరుగనున్నది.

గ్రామోత్సవంలో నాదస్వరం,కోలాటం, చెక్కభజన, రాజభటులవేషాలు, కేరళ చండీమేళం, కొమ్ముకొయ్య నృత్యం, ముంభాయ్ డోల్ ఢేష్, విళక్కు, స్వాగత నృత్యం వీరభద్రడోలు కునిత, జాంజ్ పథక్ ( కర్ణాటక డోలు) కాళికా నృత్యం, జానపద పగటి వేషాలు, నందికోలు సేవ, గొరవనృత్యం, తప్పెటచిందు, బీరప్పడోలు, నందికోలసేవ, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలు విన్యాసం, గిరిజన చెంచు నృత్యం తదితర కళారూపాలను గ్రామోత్సవంలో ఏర్పాటు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం సంబంధించిన అన్ని శాఖలు విభాగాల సిబ్బంది. జిల్లా పోలీస్ శాఖ సిబ్బంది మల్లన్న భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఎస్సై మాలోత్ సురేష్, సర్పంచ్ పెదమాముల యాకయ్యలు ఆవిష్కరించారు. ఈనెల 14 నుండి 16 వరకు స్వామి వారి కళ్యాణంతో పాటు బ్రహ్మోత్సవాలు, హోమాలు, రుద్రాభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు దేవేంద్ర శర్మ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాసా యకన్నా, వార్డు సభ్యులు షేక్ హసీనా, మాజీ దేవస్థానం చైర్మన్ బొల్లం రమేష్ బాబు, లక్ష్మి నారాయణ, వేముల నరసింహారెడ్డి, వెంకట్రాం నర్సయ్య, దోమల యాదగిరి, వెంకన్న, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## డాడీ హెల్మెంట్ షార్ట్ ఫిలిం రిలీజ్ చేసిన

**టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి**



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** ఎం.స్టార్ మీడియా ఆధ్వర్యంలో డాడీ హెల్మెట్ వాడు తెలుగు షార్ట్ ఫిలిం. నందికొట్కూరు సి ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి చేతులు మీదిగా రిలీజ్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ..మన నందికొట్కూరులో షార్ట్ ఫిలిం. ఎం. స్టార్ మీడియా డాడీ హెల్మెట్ షార్ట్ ఫిలిం. చాలా బాగా చేశారు. విద్యార్థులందరి యాక్టింగ్ కూడా బాగా చేశారు. హెల్మెట్ షార్ట్ ఫిలిం వాహనదారులకు ఒక మెసేజ్ అన్నారు.దీంట్లో యాక్టింగ్ చేసిన ప్రతి ఒక్కరికి ఎం.స్టార్ డాన్స్ అకాడమీ వారికి. టీషర్ట్స్ షూస్ స్పాన్సర్ చేశారు. అనంతరం డైరెక్టర్ ను టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి అభినందించారు.

## జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయండి

- **పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం**
- **జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య**




**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** మార్చి నెల 14వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయమని నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి వి దివ్య తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణంలో నందికొట్కూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులతో మరియు పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ..రాజీ అయ్యే సివిల్ మరియు క్రిమినల్ తగాదాలలో ఇరుపక్షాలతో మాట్లాడి రాజి అయ్యే విధంగా కచ్చిదారులకు అవగాహన కల్పించాలని వారు సూచించారు. జాతీయ లోక్ అదాలత్ కొరకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మరియు నందికొట్కూరు పరిసర ప్రాంతాలలోని కక్షిదారులు ఈ యొక్క సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.శరభయ్య, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు మరియు పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని ఆదరించండి: ప్రజా సంక్షేమం

- **బీఅర్ఎస్ తోనే సాధ్యం**
- **అబద్ధాల కాంగ్రెస్ పై ఆగ్రహంలో ప్రజలు**
- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో ఐదు**
- **మున్సిపాలిటీలను గెలుచుకుంటాం**
- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి**
- **బీఅర్ఎస్ శ్రేణులతో కలిసి జిన్నారం మున్సిపాలిటీలో విస్తృత ప్రచారం**



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** పటాన్ చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమం మరింత ముందుకు సాగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజైన సోమవారం జిన్నారం మున్సిపాలిటీ పరిధిలో పెద్దమ్మగూడెం, మంగంపేట్, నల్తూర్, కొర్లకుంట, జిన్నారం వార్డులలో ఆయా వార్డుల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు.ఈ సందర్భంగా గూడెం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కృషితో పటాన్ చెరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్రజలకు కావలసిన మౌలిక వసతులకు సౌకర్యాలకు పెద్దపీట వేస్తూ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి గ్రామంలో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్ణయించడం జరిగిందని గుర్తు చేశారు. అబద్దాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండేళ్లలో అభివృద్ధి సంక్షేమాన్ని బ్రష్టు పట్టించారని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను తప్పు దోవ పట్టించి ప్రజల నమ్మకాన్ని నిండా ముంచిన గణిత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలలో అభివృద్ధి సంక్షేమం కొనసాగాలంటే ప్రజలంతా నిండు మనసుతో ఆలోచించి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## శివ భక్తులు పోలీసులకు సహకరించాలి

- **భారీ గూడ్స్ వాహనాలు దోర్నాల విజయవాడకు**
- **గిద్దలూరు,నంద్యాల మీదుగా వెల్లవలెను**
- **ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్**

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** మహాశివరాత్రి పండుగకు సంబందించి భక్తులకు/పాదాచారులకు జిల్లా ఎస్పీ సునీల్ షొరణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసు సూచన తప్పక పాటించాలి అదే విధంగా మహాశివరాత్రి పండుగ సందర్భముగా, ఆత్మకూరు నుండి దోర్నాల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ ను నియంత్రించుట కొరకు, సోమవారం నుండి కర్నూలు నుండి విజయవాడ వైపు వెళ్ళు భారీ గూడ్స్ వాహనములను దోర్నాల మీదుగా అనుమతించబడవు. సదరు భారీ వాహనములు నంద్యాల మీదుగా వెల్లవలెను.అదే విధముగా విజయవాడ నుండి కర్నూలు వైపు వచ్చే భారీ గూడ్స్ వాహనములు దోర్నాల ఆత్మకూరు మీదుగా అనుమతించబడవు. సదరు వాహనములు గిద్దలూరు, నంద్యాల మీదుగా వెళ్ళవలెనని ఆత్మకూరు డిఎస్పి ఆర్ఆర్ నాయక్ మీడియా ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు డిఎస్పీ మాట్లాడుతూ శ్రీశైలంకు కాలినడకన వెళ్ళు భక్తులు రోడ్డుకు ఒక వైపున మాత్రమే వెళ్ళవలనని అన్నారు.పాదచారులు జేబుదొంగల పట్ల అప్రమత్తముగా ఉంటూ, వారి యొక్క వస్తువులను మరియు లాగేజీ ని జాగ్రత్త చూసుకొనవలెను.గూడ్స్ వాహనముల యందు మనుషులు అనుమతించబడరు మరియు వాహనాల యందు ప్రయాణికులు పరిమితికి మించి ప్రయాణించరాదు నిర్దేశించిన వేగముతో వెల్లవలెను. అతివేగముతో ప్రయాణించరదన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, పోలీసు వారికి సహకరించవలెను. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన యెడల మోటార్ వాహనాల చట్టప్రకారం చర్య తీసుకొనబడును. వాహన డ్రైవరు లు మద్యం సేవించి వాహనాలను నడపరాదు. ముఖ్యంగా వెంకటాపురం వరకు వాహనములలో వచ్చి, కాలినడకన వెళ్ళు భక్తులు, వారి యొక్క వాహనములను రోడ్డు పై ఎక్కడ పడితే అక్కడ నిలిపి వేయకుండా, వెంకటాపురం వద్ద వారికి కేటాయించిన పార్కింగ్ ప్రదేశం నందు ఒక క్రమపద్ధతిలో పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్ కి అంతరాయం కలగకుండా పోలీసు వారికి సహకరించవలెన్నారు.చిన్నపిల్లలతో పాటు కాలినడకన వెళ్ళే వారు, పిల్లల పట్ల అప్రమత్తంగా ఉంటూ, వారు తప్పిపోకుండా చూసుకోవలెను. భక్తులు అడవిలో ప్రయాణించేటప్పుడు అటవీ పరిసరాలకు ఎటువంటి హాని తలపెట్టరాదు భక్తులు అటవీ మార్గములో ప్రయాణించేటపుడు వన్య ప్రాణులకు హాని తలపెట్టకుండా, జంతువుల నుండి అప్రమత్తముగా ఉండవలెను. అటవీ మార్గములో ప్లాస్టిక్ వస్తువులు అనుమతించబడమని అన్నారు.

## ఆ విషయంలో రాజమౌళి హెల్ప్ తీసుకుంటున్నా..

'సవాళ్లను స్వీకరించడమంటే నాకిష్టం. కష్టతరమైనది సాధించినప్పడు కలిగే ఆనందానికి విలువ కట్టలేం' అంటున్నారు బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా. ప్రస్తుతం ఆమె మహేశ్‌బాబుకు జోడీగా రాజమౌళి 'వారణాసి' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రబృందం ఓ నేషనల్ ఛానల్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. 'తెలుగుభాషతో మీ ప్రయాణం ఎలా ఉంది?' అని ప్రియాంకను ఆ ఇంటర్వ్యూలో వ్యాఖ్యాత అడగ్గా.. 'నాకు తెలుగు అస్సలు రాదు. నిజానికి తెలుగు భాష నేర్చుకోవడం చాలా కష్టం. మామూలుగా మాట్లాడటం ఒకెత్తయితే.. కెమెరా ముందు డైలాగ్ చెప్పడం మరో ఎత్తు. అందుకే ఈ విషయంలో రాజమౌళి హెల్ప్ తీసుకుంటున్నా. ఆయన నాకు డైలాగ్ అర్థం చెబుతారు. పాత్ర ఇన్‌టెన్షన్‌ని వివరిస్తారు. దాన్ని బట్టి ఓ పదినిమిషాలు దానిపై వర్క్ చేసి, అప్పుడు నా స్టైల్‌లో నేను డైలాగ్ చెప్తున్నా. నిజానికి అది అంత ఈజీ కాదు. అందరి సహకారం వల్లే అది సాధ్యమవుతోంది.' అంటూ సమాధానమిచ్చింది ప్రియాంక.



Printed,Published,Edited, & owned by **Rathod Vinod Kumar** Published from **SNEHITHA PUBLICATIONS** Falcon Printing press, # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code :502220, Printed At Falcon Printing Press # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code: 502220, Editor: **Rathod Vinod Kumar**. RNI NO. TELTEL/2023/87655,Cell : 9550021491,7893532721, Gmail: deekshaprabhatelugudaily@gmail.com